సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
గురువారం । 10 । అక్టోబర్ । 2024



గొప్ప పండుగ బతుకమ్మ

మహిళలు ఆడుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని టీజీ ఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. - 10లో



పరిమళించని జీవితాలు..

పూల ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో వ్యాపారం చేయడం కష్టంగా మారిందని పూల వ్యాపారులు వాపోతున్నారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం $33^0/24^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం పలు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

14న టార్చ్ ర్యాలీ

భూపాలపల్లి అర్బన్: సీఎం కప్ క్రీడా పోటీలను పురస్కరించుకుని ఈనెల 14న జిల్లా కేంద్రంలో టార్చ్ ర్యాలీ నిర్వహించనున్నట్లు యువజన క్రీడల శాఖ జిల్లా అధికారి లావుడ్య జైపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కప్–2024 క్రీడాకారులకు కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హనుమాన్ టెంపుల్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు జరిగే ఈర్యాలీలో జిల్లాలోని క్రీడాకారులు, కోచ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్యాంటీన్ తొలగించొద్దని నిరసన



భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గత కలెక్టర్ తనకు కేటాయించిన క్యాంటీన్‌ను తొలగించవద్దని క్యాంటీన్ నిర్వాహకుడు కప్పల రాజేశ్ ఆస్పత్రి ఎదుట బుధవారం నిరసన తెలిపాడు. ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ కోసం తన క్యాంటీన్‌ను తొలగిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పేషెంట్లకు సేవలందించానని, మూడుసార్లు కోవిడ్ బారిన పడి ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడినట్లు తెలిపాడు. క్యాంటీన్ తొలగిస్తే తనకు ఆత్మహత్యే శరణ్యమన్నాడు. తన క్యాంటీన్‌కు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నాడు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన ఎండీ.వసీం(25) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వసీంకు తన సమీప బంధువులతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. అతడి తమ్ముడు వహీద్ ఇంటికి వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందించాడు. ఈమేరకు ఘటనాస్థలిని సెకండ్ ఎస్సై శాఖన్ పరిశీలించారు. వహీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడికి భార్య, రెండు నెలల బాబు ఉన్నాడు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

ములుగు: పోలీసు అమరవీరుల జ్ఞాపకార్థం ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న ఫ్లాగ్‌డే సందర్భంగా పోలీసు సంబంధిత అంశాలపై ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఔత్సాహిత యువత ముందుకు రావాలని ఎస్పీ డాక్టర్ శబరీష్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పోటీల్లో పాల్గొనే వారు 20వ తేదీ సాయంత్రం వరకు సమీపంలోని పోలీస్ స్టేషన్, డీఎస్పీ కార్యాలయంలో వివరాలను అందించాలన్నారు. షార్ట్‌ఫిల్మ్ 3 నిమిషాల నిడివి, ఫొటోగ్రఫీలో 10+8 సైజుల్లో సీడీ లేదా పెన్‌డ్రైవ్‌లో అప్‌లోడ్ చేసి అందించాలన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన 3 షార్ట్‌ఫిల్మ్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించడం జరుగుతుందన్నారు.

ఐటీడీఏ విద్యను విచ్ఛిన్నం చేస్తున్న డీడీ



ఏటూరునాగారం: ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యాలయాలు, విద్యను విచ్ఛిన్నం చేస్తున్న ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచంను వెంటనే గిరిజన సంక్షేమశాఖకు సరెండర్ చేయాలని ప్రజా సంఘాల నాయకుడు పొడెం రత్నం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన విద్యా వ్యవస్థను వినాశనం చేస్తున్న విద్యాశాఖ అధికారి డీడీ పోచం మొండి వైఖరి విధానంతో ఏజెన్సీ ప్రాంతంలో విద్య కుంటుపడుతుందన్నారు. గిరిజన విద్య అభివృద్ధి చేయాల్సిన అధికారి కమీషన్ మత్తులో గిరిజన విద్యార్థులు, ఉపాధ్యాయ ఉద్యోగుల భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్నాడన్నారు. ప్రాజెక్టు అధికారి, కమిషనర్, జిల్లా మంత్రి సీతక్క ఆదేశాలు కూడా పట్టించుకోవడం లేదన్నారు. గిరిజన విద్య అభివృద్ధి అడ్డుగా మారాడని, పోచంను తొలగించే వరకు పోరాటం చేస్తామని తీర్మానం చేశామన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘాల జేఏసీ, తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు సన్నద్ధం

జిల్లాలో 2.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

- 189 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- నవంబర్ మొదటి వారంలో అందుబాటులోకి..
- ఈసారి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వనున్న ప్రభుత్వం



జంగుపల్లిలో కొనుగోలు కేంద్రం (ఫైల్)



భూపాలపల్లి రూరల్: జిల్లాలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. గతేడాది వానాకాలం మాదిరిగా 189 కొనుగోలు కేంద్రాల ద్వారా 2.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నవంబర్ మొదటి వారంలో కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు. అందుకోసం అవసరమైన గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు సమకూర్చుకోవడంలో అధికారులు నిమగ్నమవుతున్నారు.

189 కేంద్రాలు..

రైతులకు అందుబాటులో ఉండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 189 కేంద్రాలు ఏర్పాటు చేయనుండగా.. ఐకేపీ ద్వారా 9, పీఏసీఎస్ ఆధ్వర్యాన 164, జీసీసీ ద్వారా 4, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 12 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. 1.41 లక్షల టన్నుల సన్నధాన్యం, 60 వేల టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏటా వానాకాలం, ఎండాకాలంలో ధాన్యం సేకరణపై పౌర సరఫరాల సంస్థ భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నప్పటికీ ఆ స్థాయిలో కొనుగోళ్లు జరగడం లేదు. గతేడాది ప్రైవేట్ మిల్లర్లు నేరుగా కల్లాలనుంచే ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈఏడాది అలాంటి పరిస్థితులు ఏర్పడకుండా అధికారులు ముందుగానే కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. టార్పాలిన్లు, తేమ నిర్ధారణ యంత్రాలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను సమకూర్చుకుంటున్నారు.

ప్రభుత్వ బోనస్

ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ తేమ శాతం, తాలు తదితర నిబంధనలతో రైతులు చాలా మంది కేంద్రాల్లో అమ్మేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇక సన్న బియ్యానికి బహిరంగ మార్కెట్లో మంచి ధర పలుకుతుండడంతో వ్యాపారులు అధిక ధర చెల్లించి సన్నరకం ధాన్యాన్ని కల్లాల వద్దే సేకరించే అవకాశం ఉంది. ఈసారి ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాకు మద్దతు ధర రూ.2,320తోపాటు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. దీనికి తోడు ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండడంతో రైతులు ప్రాధాన్యం ఇస్తారని పౌర సరఫరాల శాఖ భావిస్తోంది.

కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం..

జిల్లాలో ధాన్యం దిగుబడి అంచనా మేరకు కొనుగోళ్లకు సిద్ధమవుతున్నాం. ఇప్పటికే కలెక్టర్ రాహుల్ శర్మ వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిమాండ్ మేర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

– రాంబాబు, మేనేజర్, జిల్లా పౌర సరఫరాల శాఖ

జిల్లా కేంద్రంలో పూలు కొంటున్న మహిళలు, పాత ఎర్ర చెరువు వద్ద ఏర్పాట్లు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది





సద్దులకు సర్వం సిద్ధం

- నేటి వేడుకకు ముస్తాబవుతున్న బతుకమ్మ ప్రాంగణాలు
- మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక ఏర్పాట్లు
- జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో పర్యవేక్షణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో సద్దుల బతుకమ్మను గురువారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేశారు. మహిళలకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. సద్దుల బతుకమ్మ జరుపుకునే ప్రాంగణాలు, ఆలయ ప్రాంగణాల్లో విద్యుద్దీపాలు బిగించారు. జలాశయాలు, చెరువుల వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. పోలీస్ యంత్రాంగం బందోబస్తుపై దృష్టి సారించింది. బతుకమ్మ జరుపుకునే ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులు పరిశీలిస్తున్నారు. భూపాలపల్లి పట్టణంలో పెద్ద ఎత్తున వేడుకలను నిర్వహించేందుకు అంబేడ్కర్ స్టేడియం, వారంతపు సంత, హనుమాన్, అయ్యప్ప, రామాలయాల్లో బతుకమ్మ ఆడేందుకు వేదికలు ముస్తాబు చేశారు.

పూలకు భలే గిరాకీ

వైభవంగా బతుకమ్మ పండగను జరుపుకునేందుకు పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డలతో ఊళ్లన్నీ సందడిగా మారాయి. నూతన వస్త్రాలు, అలంకరణ వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి నెలకొంది. సద్దులను పురస్కరించుకుని గ్రామాల నుంచి కొందరు గ్రామీణులు తంగేడు గునుగు, టేకు, బంతి పూలను జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోకి తీసుకొచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. మార్కెట్లో పూలకు ధరలు ఇలా పలుకుతున్నాయి. తంగేడు పూల కట్ట సైజును బట్టి రూ.10 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు. గునుగు పూల కట్టలు రూ. 20 నుంచి రూ.30 వరకు, బంతి పూలు ప్రాంతాన్ని బట్టి కిలోకు రూ.100 నుంచి 150 వరకు విక్రయిస్తున్నారు.

బతుకమ్మ ఆటస్థలంలో ఏర్పాట్లు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ఎర్రచెరువు వద్ద సద్దుల బతుకమ్మ ఆటస్థలంలో ఏర్పాట్లను డీఎల్పీఓ వీరబ్రహ్మయ్య చేపట్టారు. బుధవారం చదునుతో పాటు లైటింగ్ ఏర్పాట్లను ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

వర్గీకరణ తర్వాతే నోటిఫికేషన్ ఇవ్వాలి



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

భూపాలపల్లి రూరల్: 'సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చారు. వర్గీకరణ చేయకముందే ఉద్యోగ నోటిఫికేషన్, ఉద్యోగ నియామకాలు ప్రకటించారు. దీంతో మాదిగలకు అన్యాయం జరుగుతోంది. వర్గీకరణ చేపట్టిన తర్వాతే ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వాలి' అని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి మాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ చేసిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని కోరుతూ.. బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు భూపాలపల్లి అంబేడ్కర్ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపి కార్యాలయ ఏఓకు వినతి పత్రం ఇచ్చారు. ఈధర్నాకు సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేశ్, వీకేసీ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల అనిల్ కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు బాబు, మారపాక లచ్చయ్య, నోముల శ్రీనివాస్, దొర్నాల రాజేందర్, గాజుల భిక్షపతి, అంతడుపుల సురేశ్, చర్ల దుర్గయ్య, రామ్‌చందర్, కేసారపు నరేశ్, మంద తిరుపతి, నేర్పటి అశోక్ మడిపల్లి సుమన్, జీడి రాజన్న, మంద కిరణ్, బోడికల శ్రీకాంత్, మంచినీళ్ల వైకుంఠం, కుమ్మరి అనిల్, కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కాళేశ్వరం' అభివృద్ధికి ప్రణాళిక ఇవ్వండి

- కలెక్టర్ రాహుల్ శర్మ
- అధికారులతో సమీక్ష



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రాహుల్

భూపాలపల్లి: కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో దేవాదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇటీవల దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు కాళేశ్వర క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు ఇచ్చిన సలహాలు, సూచనల మేరకు దేవస్థానం అభివృద్ధికి సంబంధించి కార్యాచరణ నివేదికలను త్వరితగతిన సిద్ధం చేయాలన్నారు. గోదావరి నదిలో భక్తులు వ్యర్థాలు వేయకుండా చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రంలో వాహనదారుల నుంచి టోల్ వసూలు ద్వారా వచ్చే ఆదాయంతో ఘాట్ వద్ద పారిశుద్ధ్య పనులు, స్నాన ఘట్టాలు, అస్థికల నిమజ్జనం, ఘాట్ వద్ద విడిచిన బట్టలు, వ్యర్థాలు ట్రాక్టర్ ద్వారా తరలించేందుకు, పారిశుద్ధ్య కార్మికుల నియామకాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. పిండప్రదానాలు, సామగ్రి భద్రపర్చేందుకు ప్రత్యేకంగా లాకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. 100 గదుల సత్రం, అన్నదాన సత్రం, యాత్రికుల సౌకర్య కేంద్రం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

మద్యం, మాంసాహార నిషేధానికి సంబంధించి హోర్డింగులు పెట్టండి..

గోదావరి ఒడ్డున భక్తులు బట్టలు మార్చుకునేందుకు శాశ్వత ప్రాతిపదికన గదుల ఏర్పాటుతో పాటు షవర్లు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సులభ్ కాంప్లెక్స్ నుంచి మురుగునీరు గోదావరిలో కలవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. దేవాలయ పరిసరాల్లో శివ నామ స్మరణ మార్మోగేలా మైక్‌లు ఏర్పాటు చేయాలని, గోదావరి వద్ద భక్తులు పరిశుభ్రత పాటించేలా అవగాహన కోసం హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. దేవాలయ ప్రాశస్త్యాన్ని కాపాడేందుకు ఆలయ పరిసరాల్లో మద్యం, మాంసాహారం నిషేధమని తెలియజేసే హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. లైటింగ్, తాగునీటి సరఫరాకు ప్రతిపాదనలు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్, ఆర్‌ఓ ప్లాంట్, బయో మరుగుదొడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలివ్వాలన్నారు. కాళేశ్వరం వచ్చే భక్తులు ఎక్కడి నుంచైనా రూములు బుక్ చేసుకునేందుకు ఆన్‌లైన్ సేవల్ని అందుబాటులోకి తీసుకురావాలని దేవస్థానం ఈఓను కలెక్టర్ ఆదేశించారు. ఈసమావేశంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, సీపీఓ బాబూరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాళరాత్రి అలంకరణలో అమ్మవార్లు





శుభానందదేవి అమ్మవారికి పండ్లతో అలంకరణ, ప్రత్యేక అలంకరణలో సరస్వతీ అమ్మవారు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కాళేశ్వరం: కాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయాల్లోని శుభానందేవి, సరస్వతీ అమ్మవార్లు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు మూలా నక్షత్రం సందర్భంగా కాళరాత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం శ్రీసరస్వతీ అమ్మవారి ఆలయంలో అర్చకులు విశేష పూజలు చేశారు. సామూహికంగా అక్షర స్వీకారం చేయించారు. ప్రత్యేకంగా హోమం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీశుభానంద దేవి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు నగలతో అలంకరించి, ఆపిల్స్, ఆరెంజ్, సీతాఫలాలు, డ్రాగన్‌ఫ్రూట్ తదితర పండ్లతో దండలు వేశారు. సరస్వతీ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మెంగాని మాధవి, దేవస్థానం మాజీ డైరెక్టర్లు మెంగాని అశోక్, అడప సమ్మయ్య, నాయకులు కామిడి లక్ష్మీశ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కేయూకు నేడు సెలవు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు, ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు గురువారం సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని యూనివర్సిటీ పరిధి అన్ని కళాశాలలు, కార్యాలయాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 సెలవుకు బదులుగా నవంబర్ 9న శనివారం పనిదినంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. బోధన, బోధనేతర ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు గమనించాలని కోరారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

ములుగు: ఎస్సీ రిజర్వేషన్ అమలుచేయకుండా డీఎస్సీ ఖాళీలను భర్తీ చేయడం సరికాదని ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్రి సతీష్ మాదిగ అన్నారు. ఈ మేరకు ఎంఎస్పీ ములుగు జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబుమాదిగ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. నల్లజెండాలను ప్రదర్శిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పైడి, సతీష్ మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేపడతామన్నారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని మండిపడ్డారు.

నిబంధనల మేరకే ఇసుక తవ్వకాలు

- అదనపు కలెక్టర్ మహేందర్‌జీ
- ఇసుక క్వారీ నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ



కార్యక్రమానికి హాజరైన అధికారులు, గ్రామస్తులు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

మంగపేట: నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు చేపట్టాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఉమ్మడి వరంగల్ జిల్లా రీజినల్ కార్యాలయం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీత అన్నారు. మండలంలోని మల్లూరు గ్రామపంచాయతీ పరిధి మామిడిగూడెం సమీప గోదావరిలో 2 ఇసుక క్వారీ నిర్వహణకు తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌ఎండీసీ) ప్రతిపాదనపై పర్యావరణ అనుమతులు పొందేందుకు అదనపు కలెక్టర్ చీమలపాటి మహేందర్‌జీ అధ్యక్షతన ప్రజాభిప్రాయ గ్రామసభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదావరి నదిలో 15 హెక్టార్ల విస్తీర్ణంలో మాన్యువల్ పద్ధతిపై 2.99,984 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక సేకరణపై పర్యావరణ పరిరక్షణ అనుమతుల కోసం ప్రజాప్రాయసేకరణ నిమ్మితం గ్రామసభను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇసుక క్వారీ నిర్వాహణకు ఉత్పన్నమయ్యే సమస్యలపై ముందస్తుగా అంచనా వేసిన శ్రీ సాయిమానస నేచర్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ పర్యావరణానికి, జలవనరులకు ఎలాంటి ప్రభావం ఉందని, పూర్తి మాన్యువల్ పద్ధతిలో ఇసుకను తీసేందుకు చేతి పనిముట్లు ఉపయోగించడం, ట్రక్కుల్లోనే ఇసుక రవాణా చేయడం జరుగుతుందన్నారు. అలాగే 9 అంశాలపై గ్రామ ప్రజలకు వివరించారు.

గిరిజనేతరులకు అవకాశం కల్పించాలి..

గోదావరి నది గ్రామం మొత్తానికి చెందిందని, ఇసుక క్వారీ నిర్వహణలో కూలీలుగా పనిచేసేందుకు గిరిజనేతరులకు అవకాశం కల్పించాలని పలువురు కోరారు. ప్రస్తుత ఇసుక క్వారీలో గిరిజనేతరులకు పని కల్పించడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలో తవ్వకాలు జరపడం ద్వారా భూగర్భ జలాలు పడిపోవడంతో బావులు అడుగంటి పోయాయని, బోరు బావుల్లో సైతం నీటిమట్టం పడిపోయిందని, దీంతో ప్రజలకు తాగునీరు, రైతుకు సాగునీరు సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. అలాగే ఒడ్డు వెంట ఇసుక తీయడంతో గోదావరి వరదల కారణంగా ఒడ్డు వెంట ఉండే విలువైన సాగుభూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మహేందర్‌జీ మాట్లాడుతూ.. ప్రతీఒక్కరి అభిప్రాయాన్ని, ప్రజల నుంచి సేకరించిన ప్రతీ విషయాన్ని పర్యావరణ మంత్రిత్వ శాఖకు పంపిస్తామని, ప్రజల అభిప్రాయం మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జయరాజు, టీజీ ఎస్ఎండీసీ పీఓ శ్రీకాంత్, ఎంపీడీఓ బద్రు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఆర్‌ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కిశోర్, గిరిజన సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



వీల్‌చైర్స్ అందజేస్తున్న ఎస్పీ శబరీష్

ఏటూరునాగారం: జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు తావులేకుండా చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని, క్రీడలతో మానసికోల్లాసం, స్నేహం బలపడుతుందని ఎస్పీ శబరీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో హోప్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన జిల్లా క్రికెట్ క్రీడల ముగింపు కార్యక్రమాన్ని ఎస్పీ హాజరై క్రికెట్ మ్యాచ్‌ను ఆడారు. ఐదురోజులుగా పర్యావరణ పరిరక్షణ అవగాహనపై నిర్వహిస్తున్న హెచ్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా జిల్లా పోలీసులు, జిల్లా క్రికెట్ అసోసియేషన్‌తో చారిటీ మ్యాచ్ నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా పోలీసులు విజయం సాధించారు. జిల్లా పోలీసులు, హోప్ సంస్థ ద్వారా దివ్యాంగులకు వీల్‌చైర్స్‌ను అందజేశారు. క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ధనసరి సూర్య రూ.20వేలు హోప్ సంస్థకు విరాళంగా అందజేశారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దన్నారు. గట్కా, గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్, కాంగ్రెస్ నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, రఘు, వలియాబీ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు వహిద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఆరాధనే బతుకమ్మ..

నేడు సద్దుల పండుగ.. గంగమ్మ చెంతకు బతుకమ్మ

- ఆడబిడ్డకు(బతుకమ్మ) చద్ది (ఫలహారాలు) ఇచ్చి సాగనంపనున్న మహిళలు
- నైవేద్యంగా సద్దుల బతుకమ్మ ఫలహారాలు


బతుకమ్మ చద్దులు


బతుకమ్మ

హన్మకొండ కల్చరల్ : బతుకమ్మ.. పూల పండుగ. ప్రకృతిని ఆరాధించే వేడుక.. మనుషుల మధ్య బంధం పెంచడంతో పాటు అందరి బతుకును కోరుతుంది. అదే బతుకమ్మ పండగలో ఉన్న పరమార్థం. తొమ్మిది రోజుల క్రితం పెత్రమావాస్య నుంచి ప్రారంభమైన బతుకమ్మను ఆడపడుచులు సంబురంగా జరుపుకున్నారు. తొమ్మిదిరోజుల పాటు సందడి చేసిన ఈ పండుగ పాటలు చారిత్రక, సామాజిక అంశాల పరమార్థం తెలియజేస్తాయి. ఇంతటి విశిష్టత గల ఈ పర్వదినం గురువారంతో పూర్తవుతుంది. ఈ క్రమంలో నగరంలో సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవడానికి మహిళలు సిద్ధమవుతున్నారు. ఈ రోజు బతుకమ్మను ప్రతిష్టాత్మకంగా పేరుస్తారు. కొత్త దుస్తులు, నగలన్నీ ధరించి ఆనందంగా బయలుదేరుతారు. సద్దుల బతుకమ్మపై పసుపు గౌరమ్మ పెట్టుకుని చెరువు ఒడ్డుకు వెళ్లి వెంపలిచెట్టును మధ్యలో పాతి చుట్టూ బతుకమ్మలను పెట్టుకుని అలసిపోయేదాక ఆడుతారు.

కమ్మటి సద్దులు..

ప్రతి పండుగకు ప్రాంతాన్ని బట్టి, కాలాన్ని బట్టి ప్రత్యేక ఆహారం ఉంటుంది. బతుకమ్మ పండుగలో తొమ్మిదిరోజుల పాటు తొమ్మిదిరకాల నైవేద్యాలతో బతుకమ్మ తల్లిని ప్రసన్నం చేసుకునే తీరు కనిపిస్తుంది. ఈ ఆహారం పరిపూర్ణంగా పోషక విలువలు కలది. ఇందులో చేసే ఫలహారాలను సద్దులు అంటారు. అంటే పొలంలో పనిచేస్తున్న బంధువుల కోసం లేదా ప్రయాణంలో ఉన్న బంధువులకోసం సిద్ధం చేసే టిఫిన్ క్యారియర్ మాదిరి. పూర్వకాలంలో బంధువులను సాగనంపుతున్నప్పుడు కూడా బహుదూరం నడవాల్సిఉండేది. అందుకే దారి వెంట తినడానికి సద్దులు కట్టి ఇచ్చేవారు. వారితో పాటు ఊరిపొలిమేర వరకు వెళ్లిసాగనంపేవారు. తమ ఆడబిడ్డగా భావించే బతుకమ్మను కూడా ఇలాగే సద్దులు కట్టి ఊరిపొలిమేర వరకు సాగపంపుతుంటారు. ఈ సద్దుల పేరుమీదనే చివరిరోజు జరుపుకునే పెద్దబతుకమ్మ పండుగను సద్దుల బతుకమ్మ అని పిలవడం ప్రారంభమైంది. ఒక ఆకులో చద్దులు(ఫలహారాలను) పెట్టి కొత్తగుడ్డలో వేసి మూటలా కట్టి బతుకమ్మను చెరువులో నిమజ్జనం చేసేముందు బతుకమ్మలో ఉంచి నిమజ్జనం చేస్తారు. అంటే చద్దితో బతుకమ్మను పంపిచడం. సద్దుల బతుకమ్మరోజు ప్రధానంగా కిలోలకొద్ది ఫలహారాలు తయారుచేసుకుని పిల్లలు, పెద్దలకు, ఇరుగుపొరుగువారికి పంచిపెడుతారు.

సద్దుల బతుకమ్మ ఫలహారాలు..

ఎంగిలిపూల బతుకమ్మ నుంచి (మొదటి రోజు)తొమ్మిదో రోజున పెద్ద బతుకమ్మ లేదా సద్దుల బతుకమ్మ రోజు మరింత ఉత్సాహంగా వంటలు చేసుకుంటారు. ఆరోజు పులిహోరసద్ది, చిత్రాన్నంసద్ది, పల్లీలపొడిసద్ది, నువ్వుల పొడిసద్ది, పెసరసద్ది, కొబ్బరికోరుసద్ది, పుట్నాల పొడులసద్ది, ఆవాలసద్ది, పెరుగుసద్ది, సజ్జరొట్టెలు, మలీద లేదా మలీల ముద్దలు, సత్తుపిండి ముద్దలు, మొదలైన ఇతర వంటకాలను సద్దులుగా కట్టి తీసుకువెళ్తారు. గింజలను వేయించి చక్కెర, బెల్లంతో కలిపి నూరి పొడులు చేస్తారు. వీటితో పాటు ఈ కాలంలో లభించే సీతాఫలం, బత్తాయి పండ్లను కూడా నైవేద్యాంగా పంచి పెడతారు.

గొప్ప పండుగ బతుకమ్మ

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: మహిళలు ఆడుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. విద్యుత్ మహిళా ఉద్యోగులు తీరొక్క పూలతో పేర్చిన భారీ బతుకమ్మ ఎదుట ఆడారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జరుపుకునే అతి ముఖ్యమైన పండుగల్లో బతుకమ్మ ఒకటని, అందమైన పూల పండుగ అన్నారు. 9 రోజుల పాటు మహిళలు ఆనందోత్సవాల మధ్య ఆడుకునే పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎండీ సతీమణి చాహత్ బాజ్ పాయ్, ఇన్‌చార్జ్ డైరెక్టర్‌లు బి. అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీజీఎంలు కిషన్, రవీంద్రనాథ్, అన్నపూర్ణ, ప్రభావతి, సునీత, నాగరాణి, చైతన్య పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

పరిమళించని జీవితాలు..

పూల వ్యాపారులకు భారమవుతున్న రవాణా ఖర్చులు

- ఎక్కువ కొనుగోళ్లకు వినియోగదారుల నిరాసక్తత
- ఫలితంగా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్న పరిస్థితి
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

హన్మకొండ కల్చరల్ : పండుగలు, వివాహాలు, శుభకార్యాలు, దేవతార్చనలు, ఉత్సవాలు.. ఇలా కార్యక్రమం ఏదైనా పూలు, పూలదండలు లేకపోతే వాటికి నిండుదనం చేకూరదు. అలా ఆయా కార్యక్రమాలకు పూలు, పూలదండలు సరఫరా చేస్తూ నిండుదనం తీసుకొస్తున్న ఆ వ్యాపారుల జీవితాలు మాత్రం మారడం లేదు. నిత్యం పూల పరిమళాల మధ్య ఉంటున్నా వారి జీవన గమనం గుబాళించడం లేదు. మల్లెలు, గులాబీలు, చేమంతులు, ముద్దబంతుల దండల తయారీలో వారు సిద్ధహస్తులైనా..ఆర్థికపరమైన సమస్యలతో సహవాసం చేస్తున్నారు. పూల ధరలు ఆకాశం అంటుండడంతో వ్యాపారం చేయడం కష్టంగా మారింది. ఈ వ్యాపారం తప్ప మరో వృత్తి చేయలేని వీరు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి కొట్టుమిట్టాడుతున్నారు.

హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో హోల్‌సేల్ పూల మార్కెట్

వరంగల్ హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో హోల్‌సేల్ పూల మార్కెట్ ఉంది. 25 షాపులు ఉన్నాయి. 200 మందికి పైగా వర్కర్లు పనిచేస్తున్నారు. ఇక్కడి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట, తొర్రూరు, మహబూబాబాద్, ములుగు, ఏటూరు నాగారం, గూడూరు, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, భూపాలపల్లి, పరకాల, జనగామ పట్టణాలకు క్వింటాళ్ల కొద్ది పూలు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 600 పైగా పూల దుకాణాలు ఉన్నాయి. వీటిపై సుమారు 1,200కు టుంబాలు వరకు ఆధారపడి జీవిస్తున్నాయి. పరోక్షంగా మరో 4వేల కుటుంబాలు బతుకువెళ్లదీస్తున్నాయి. విభిన్న రకాల పూలతో దండలు, మహిళలు జడలో అలంకరించుకునే వేణి, పూల బిల్లలు అందంగా తయారీ చేసి విక్రయిస్తున్నారు. పూలు విక్రయించే వ్యాపారుల్లో ఎక్కువ ముస్లిం కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. కొన్నేళ్లుగా ఈ వ్యాపారమే కొనసాగిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే ప్రస్తుతం వివాహాది, శుభకార్యాల అలంకరణలకు ప్లాస్టిక్ పూలు అలంకరించడం.. గులాబీ, బంతి, చేమంతి ధర మండిపోతుండడం వల్ల పూల వినియోగం గణనీయంగా తగ్గింది. ఫలితంగా ఈ వ్యాపారులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. అలాగే, వ్యాపారుల వద్ద దండలు తయారు చేసే వారికి కూడా పనులు లేకపోవడంతో ఆయా కుటుంబాలకు కూడా కష్టాలు తప్పడం లేదు.

రవాణా భారం.. శాపం

ప్రస్తుతం పూల సాగు గణనీయంగా తగ్గింది. దీంతో వ్యాపారులకు పూల దిగుమతి కోసం రవాణా ఖర్చులు భారంగా మారాయి. ఫలితంగా గతం కంటే వ్యాపారుల ఆర్థిక పరిస్థితి కష్టంగా మారింది. ధరలు ఎక్కువగా ఉండడంతో అంతకు ముందు కిలో కొనుగోలు చేసే వినియోగదారులు ప్రస్తుతం పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారు. దీంతో పూలు వాడిపోయి పారబోయాల్సి వస్తోందని వ్యాపారులు వాపోతున్నారు. మరో వృత్తి చేయలేక.. ఉన్న వృత్తిలో కనీస గిట్టుబాటు లభించక వ్యాపారులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. వయసు మీద పడుతున్నా కొద్ది పూల వ్యాపారులుగా కొనసాగలేక కష్టాలు పడుతున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


పూలదండలు

సీజన్‌లోనే లాభాలు..



పండుగలు, శుభకార్యాలు ఉన్నప్పుడే లాభాలు ఉంటాయి. తరువాత కష్టంగా సాగుతుంది. ఒక్కొక్క సారి తయారుచేసిన దండలు అమ్ముడుపోకపోతే డబ్బు, శ్రమ వృథా అవుతుంది. ప్రస్తుతం పూల ధరలు పెరిగాయి. వ్యాపారాలు అంతంత మాత్రమే. రోజు రోజుకూ వ్యాపారం పెనుభారంగా మారుతోంది. నష్టాలతో వ్యాపారం చేయలేక కొంత మంది కూలీలుగా మారుతున్నారు.

అష్రఫ్, పూలదండల తయారీదారు, వరంగల్

బెంగళూరు నుంచి గులాబీలు తెప్పిస్తాం..



వరంగల్ హెడ్ పోస్టాఫీసు సమీపంలో 18 సంవత్సరాల క్రితం పూల మార్కెట్ ఏర్పాటైంది. ప్రస్తుతం పండుగల సీజన్. పూల దండల విక్రయాలు సాగుతున్నాయి. పెళ్లి వేడుకలకు బెంగళూరు నుంచి ప్రత్యేకంగా వివిధ రంగుల గులాబీలు తెప్పించి దండలు తయారుచేస్తాం.

-మున్నా, పూలదండల తయారీదారు, వరంగల్

వడ్డీ లేని రుణాలివ్వాలి..



నేను షాపు అద్దెకు తీసుకుని పూలవ్యాపారం చేస్తున్నా. ఈ వ్యాపారం కోసం ప్రభుత్వం వడ్డీలేని రుణాలివ్వాలి. సీజన్‌లో లాభాలు ఉంటాయి కానీ. తరువాత కష్టంగా ఉంటుంది. బెంగళూరు, హైదరాబాద్ నుంచి పూలు తెప్పిస్తున్నాం. రవాణా ఖర్చులు భారంగా మారాయి. ప్రభుత్వం ఆదుకుని కొన్ని సౌకర్యాలు సమకూర్చాలి.

-ఎండీ జావేద్, పూల వ్యాపారి వరంగల్

పూలు ఎప్పుడూ తాజాగా ఉండేలా చూడాలి..



వరంగల్ పోస్టాఫీస్ సమీపంలో కొన్నేళ్లుగా పూలు అమ్ముతున్నాం. పూలు ఎప్పుడూ తాజాగా ఉండేలా చూడాలి. లేదంటే ఎవరూ కొనరు. అప్పుడు పూలు పారబోయాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ వ్యాపారాన్ని నష్టాలతోనే నెట్టుకొస్తున్నాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

-ఎండీ మాటీన్, పూల వ్యాపారి వరంగల్

మరణంలోనూ వీడని పేగు బంధం..

- తల్లి మృతి చెందిన గంటలోపే కొడుకు మృతి
- ముల్కనూరులో ఘటన


శోభ(ఫైల్)


సాయి (ఫైల్)

ఎల్కతుర్తి: మరణంలోనూ తల్లీకొడుకుల పేగు బంధం వీడలేదు.. తల్లి మృతి చెందిన గంటకే కొడుకు కన్నుమూశాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిదురాల లక్ష్మణ్ భార్య శోభ (48) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందింది. కాగా, మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సాయి(25)బైక్ మెకానిక్‌గా పనిచేసుకుంటూ తల్లికి ఆసరా అయ్యేవాడు. అయితే గతేడాది నుంచి సాయి కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తల్లి బుధవారం మృతి చెందడంతో సాయి కూడా అనారోగ్యంతో గంటలోపే కన్నుమూశాడు. దీంతో తల్లి, కొడుకు ఇద్దరు ఒకే రోజు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేశానికి ప్రధాన శత్రువు కాంగ్రెస్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు

- బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు

హన్మకొండ: దేశానికి ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీ అని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, రాష్ట్ర సభ్యత్వ సహ ప్రముఖ్ మార్తినేని ధర్మారావు అన్నారు. బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్వేషాలు రగిలించడం.. వినాశనం కోరుకోవడం కాంగ్రెస్ విధానమైతే... దేశ అభివృద్ధి, పేదరిక నిర్మూలన బీజేపీ విధానమన్నారు. అందుకే హరియాణ ప్రజలు మూడోసారి బీజేపీకి పట్టం కట్టారన్నారు. రాష్ట్రంలో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. 40 ఏళ్ల పాలనలో మూసీ పొడవునా ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతులిచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతురావు ఇంటిపై నుంచి చూస్తే మూసీ కనిపిస్తుందని, అప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఇప్పుడు హైడ్రా పేరుతో డ్రామాలు ఆడుతుందని ధ్వజమెత్తారు. కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్ రెడ్డి, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్, సభ్యత్వ నమోదు జిల్లా ఇన్‌చార్జ్ పాపారావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు కుసుమ సతీశ్, వెన్నంపల్లి పాపన్న, ఎం.తిరుపతిరెడ్డి, వన్నాల వెంకటరమణ, సునీత, శివకుమార్, ప్రభాకర్, కుమారస్వామి పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

- ఇనుగుర్తిలో దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేసిన ముస్లిం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఎస్ఎం.హుస్సేన్ కొన్నేళ్లుగా దేవిశరన్నవరాత్రుల సందర్భంగా గ్రామంలో దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేసి మతసామరస్యం చాటుతున్నాడు. ఈ సంవత్సరం కూడా గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం పక్కన దుర్గామాత విగ్రహం ఏర్పాటు చేశారు. పూజాకార్యక్రమంలో హిందువులతో కలిసి పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. కా గా, బుధవారం అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నదా నం చేశాడు. మతసామరస్యం చాటుతున్న హుస్సేన్‌ను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.


దుర్గామాత విగ్రహం వద్ద ఎంఎస్.హుస్సేన్

హత్యాయత్నం కేసులో నేరస్తులకు జైలు

వరంగల్ లీగల్: హత్యాయత్నం కేసులో ముగ్గురు నేరస్తులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 5వేలు చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. ఆస్తిని పొందాలనే దురుద్దేశంతో కట్టుకున్న భర్తనే భార్య హత్య చేయడానికి యత్నించింది. ఈ కేసులో నేరం రుజువుకావడంతో పరకాల మండలం సీతారాంపూర్‌కు చెందిన పంచగిరి నాగజ్యోతి, ఆమె తల్లి తూల ప్రమీల, సోదరుడు భిక్షపతికి ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ సహాయక సెషన్స్ జడ్జి జె. ఉపేందర్ రావు బుధవారం తీర్పు వెలువరించారు. పంచగిరి భాస్కర్, నాగజ్యోతికి 2012లో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. నాగజ్యోతి తల్లిదండ్రుల గ్రామం పరకాల మండలం రాజిపేటలో నివసిస్తోంది. 2020 జనవరి 14న భాస్కర్ పని ముగించుకుని(లారీ క్లీనర్) రూ.10వేల నగదుతో భార్యా పిల్లల వద్దకు వెళ్లాడు. ఈ సమయంలో తండ్రి ద్వారా భాస్కర్‌కు వచ్చిన ఇళ్లను తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని నాగజ్యోతి డిమాండ్ చేసింది. వారసత్వంగా వచ్చిన ఇతర ఆస్తి మొత్తం ఇప్పటికే నీ పేరుమీద రిజిస్టేషన్ చేశా.. ఈ ఒక్క ఇళ్లు నాపేరుపై ఉంటుందని భాస్కర్ స్పష్టం చేశారు. దీంతో కోపోద్రిక్తులైన నాగజ్యోతి, ఆమె తల్లి ప్రమీల, సోదరుడు భిక్షపతి.. భాస్కర్ వద్ద ఉన్న డబ్బు లాక్కొని ఆయన నోట్లో గుడ్డలు కుక్కి కొట్టారు. అనంతరం నాగజ్యోతి వేడి నూనె భాస్కర్‌పై పోసింది. దీంతో భాస్కర్ కేకలు వేయగా చుట్టుపక్కల వారు చేరుకున్నారు. వారి సహకారంతో 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. బంధువుల ద్వారా సమాచారం తెలుసుకున్న భాస్కర్ సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా పరకాల పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దర్యాప్తు నేరం రుజువుకావడంతో ముగ్గురు నేరస్తులకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ సహాయక సెషన్స్ జడ్జి జె. ఉపేందర్ రావు తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్‌ప్రాసిక్యూటర్ వనజ కేసు వాదించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


కిషన్‌రావు(ఫైల్)

ఐనవోలు: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని వెంకటాపురంలో చోటుచేసుకుంది. జఫర్‌గఢ్ ఎస్సై రాంచరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తుమ్మరపల్లి కిషన్‌రావు(55) ఆరునెలల క్రితం పక్షవాతం బారిన పడ్డాడు. అనారోగ్య సమస్యలకు తోడు సుమారు రూ. 4లక్షలు అప్పులు కావడంతో తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య లీలాభాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంచరణ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు మృతి


రాజు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన రైతు కత్తుల రాజు(30) చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన కత్తుల సోమమల్లయ్య, రేణుక దంపతుల కుమారుడు రాజు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక తరచూ మనస్తాపం చెందేవాడు. ఈ క్రమంలో ఈనెల 7న గ్రామంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న రాజును చికిత్స నిమిత్తం హనుమకొండకు తరలించారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతిచెందాడు.

30 మేకల అపహరణ..

- విలువ రూ.4 లక్షలు
- పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు


మేక పిల్లలను కొట్టంలోనే వదిలిన దుండగులు

జనగామ: జనగామ జిల్లా కేంద్రం 23వ వార్డు బీరప్పగడ్డ మల్లన్న ఆలయ ఏరియాలోని కేమిడి లక్ష్మయ్యకు చెందిన 30 మేకలను బుధవారం తెల్లవారుజామున దుండగులు అపహరించారు. అయితే పిల్లలను అక్కడే వదిలి వెళ్లిపోయారు. ఈ మేకల విలువ సుమారు రూ.4 లక్షల వరకు ఉంటుందని లక్ష్మయ్య చెప్పారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, మేకల అపహరణతో కాపరులు భయాందోళనకు గురవుతున్నారు. పండగ సమయంలో పోలీసులు మరింత నిఘా పెంచాలని కోరుతున్నారు.

తిరుమలేశ్ అంత్యక్రియలు పూర్తి..

- 8వ తేదీ రాత్రి జనగామకు చేరుకున్న మృతదేహం
- గాంధీనగర్ శ్మశాన వాటికలో కన్నీటి వీడ్కోలు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, బంధువులు


తిరుమలేశ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జనగామ: ఉగాండా దేశంలో సెక్యూరిటీ గార్డు చేతిలో హత్యకు గురైన జనగామకు చెందిన ఇంజనీర్ ఇటిక్యాల తిరుమలేశ్(41) అంత్యక్రియలు పూర్తయ్యాయి. తిరుమలేశ్ మృతదేహం ఏడు రోజుల తర్వాత మంగళవారం రాత్రి జిల్లా కేంద్రం జనగామలోని తన నివాసానికి చేరుకుంది. నల్లగొండ జిల్లాకు చెందిన రాయల్ టెక్ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్న తిరుమలేశ్.. ఈ నెల4వ తేదీన సెక్యూరిటీ గార్డు జరిపిన కాల్పుల్లో మృతిచెందిన విషయం తెలిసిందే. అన్ని అనుమతులు పొందిన అనంతరం ఈ నెల 8వ తేదీ రాత్రి కంపెనీ ప్రతినిధులు తిరుమలేశ్ మృతదేహాన్ని స్వగ్రామం జనగామలోని గిర్నిగడ్డకు తీసుకొచ్చారు. బుధవారం సాయంత్రం వరకు ప్రజల సందర్శనార్థం ఇంటి వద్దే ఉంచి పట్టణంలోని గాంధీనగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. తిరుమలేశ్‌కు వీడ్కోలు పలికేందుకు వందలాది మంది తరలివచ్చారు.

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు

అంబులెన్స్‌లో తిరుమలేశ్ మృతదేహాన్ని తీసుకురాగా, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, కాలనీవాసులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరెడ్డి.. తిరుమలేశ్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య సునీత, తల్లి కిష్టమ్మ, తమ్ముడు, చిన్న కొడుకు, కుతురును ఓదార్చి ధైర్యం చెప్పారు.

బొగ్గు టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం

- తాడిచర్ల, మల్లారం మార్గమధ్యలో ఘటన
- న్యాయం చేయాలని మృతుడి కుటుంబీకుల ఆందోళన


శ్రీకాంత్(ఫైల్)

మల్హర్: బొగ్గు టిప్పర్ లారీ.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మల్హర్ మండలం తాడిచర్ల, మల్లారం మార్గమధ్యలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో గుడేసెల శ్రీకాంత్ (30) ద్విచక్రవాహనంపై తాడిచర్ల నుంచి చిన్నతూండ్ల గ్రామంలోని తన అత్తగారి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో తాడిచర్ల, మల్లారం మార్గమధ్యలో బొగ్గు టిప్పర్ లారీ.. ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొంది. దీంతో శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సౌందర్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కాగా, పెద్దపల్లి జిల్లా 8 ఇంక్లైన్ కాలనీ పెంచికల్‌పేట్‌కు చెందిన శ్రీకాంత్.. తాడిచర్ల ఏఎమ్మార్ కంపెనీలో రెండు సంవత్సరాల నుంచి సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తూ తాడిచర్లలో నివసిస్తున్నాడు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శ్రీకాంత్ మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోడ్డుపై ఆందోళన చేపట్టారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. బొగ్గు టిప్పర్ లారీని గుర్తించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో కుటుంబ సభ్యుల ఆందోళన విరమించారు. కాటారం సీఐ నాగార్జున రావు ఆధ్వర్యంలో భూపాలపల్లి సీసీఎస్ ఎస్సై సాంబమూర్తి, కాటారం ట్రైనింగ్ ఎస్సై శ్రీలోక్‌నాథ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, మృతుడి భార్య సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. పోలీసులు లారీని పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.


మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య కుటుంబ సభ్యుల ఆందోళన

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- డ్రైవర్లకు తీవ్ర, ప్రయాణికులకు స్వల్పగాయాలు


తీవ్రంగా గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ శ్రీను


ముక్కలైన ట్రాక్టర్

వర్ధన్నపేట: రోడ్డు క్రాస్ చేస్తున్న ట్రాక్టర్‌ను అతి వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ముక్కలు కావడంతో పాటు ట్రాక్టర్, ఆర్టీసీ డ్రైవర్లకు తీవ్ర, ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని కట్ర్యాల శివారు పెట్రోల్ బంకు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఇల్లందకు చెందిన సుంకరి శ్రీను ట్రాక్టర్ నడుపుకుంటూ వరంగల్ నుంచి ఇల్లందకు వస్తున్నాడు. ఈ క్రమంలో కట్ర్యాల శివారులోని పెట్రోల్ బంకులో డీజిల్ పోయించుకోవడానికి రోడ్డు క్రాస్ చేస్తుండగా ఖమ్మం నుంచి వరంగల్ వైపునకు అతి వేగంగా వస్తున్న హనుమకొండ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు.. ట్రాక్టర్‌ను ఢీకొంది. దీంతో ట్రాక్టర్ ముందు భాగం, ఇంజన్, టేలర్ మూడు ముక్కలయ్యాయి. డ్రైవర్ సుంకరి శ్రీను చెట్ల పొదల్లో పడ్డాడు. బస్సు ముందు భాగం అద్దాలు నుజ్జునుజ్జయి బస్సు డ్రైవర్ మధుకు చేతికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు 8 మందికి స్వల్ప గాయాలయ్యాయి. శ్రీనును వెంటనే 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా, ఈ ఘటనలో ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.